



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక   PEN POWER TELUGU DAILY   ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11   సంచిక :54   పేజీలు :12   సంపాదకులు : గంట్యాడ అప్పారావు   ప్రచురణ : ఒంగోలు   బుధవారం 30 అక్టోబర్ 2024   వెల : 5/-రూ॥

VOLUME :11   ISSUE : 54   PAGES :12   EDITOR : GANTYADA APPARAO   PUBLISHED :ONGOLE   WED 30 OCTOBER 2024   PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## ఏపీ సీఎం చంద్రబాబును కలిసిన లెజెండరీ క్రికెటర్ కపిల్ దేవ్

- విజయవాడ వచ్చిన భారత మాజీ ఆల్ రౌండర్ కపిల్ దేవ్
- టీడీపీ ఎంపీ కేశినేని చిన్నితో కలిసి ఉండవల్లి రాక
- అమరావతిలో గోల్ఫ్ కోర్స్ నిర్మాణంపై సీఎం చంద్రబాబుతో చర్చ



**పెన్ పవర్ డెస్క్:**భారత క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ నేడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. ఇవాళ విజయవాడ వచ్చిన కపిల్ దేవ్... స్థానిక ఎంపీ, ఆంధ్రా క్రికెట్ సంఘం అధ్యక్షుడు కేశినేని చిన్నితో కలిసి ఉండవల్లి తరలి వెళ్లారు. అక్కడ సీఎం చంద్రబాబుతో భేటీ అయ్యారు. అమరావతిలో గోల్ఫ్ కోర్స్, క్లబ్ ఏర్పాటుపై చర్చించినట్టు సమాచారం. క్రికెట్ నుంచి రిటైర్ అయ్యాక కపిల్ దేవ్... గోల్ఫ్ వైపు మళ్లారు. ప్రస్తుతం ఆయన ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా ఉన్నారు. కాగా, ఏపీ రాజధాని అమరావతిలో గోల్ఫ్ మైదానం ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నుంచి సానుకూల స్పందన వచ్చినట్టు తెలుస్తోంది. చంద్రబాబు అమరావతిని అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దాలని కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో గోల్ఫ్ కోర్స్ కూడా అమరావతికి ఒక అదనపు ఆభరణం అవుతుందని భావిస్తున్నారు. కాగా, గన్నవరం ఎయిర్ పోర్టులో కపిల్ దేవ్ కు ఎంపీ కేశినేని చిన్ని, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు స్వాగతం పలికారు.

- రచ్చకెక్కిన జగన్-షర్మిల ఆస్తుల వ్యవహారం
- ఓ తల్లిగా తనకు ఇద్దరు బిడ్డలూ సమానమేనన్న విజయమ్మ
- బిడ్డలకు ఆస్తులు సమానంగా పంచాలన్నది కూడా నిజమని వెల్లడి
- ఆస్తుల వృద్ధిలో జగన్ కష్టం ఉందనేది నిజం అని స్పష్టీకరణ



# జరగకూడనివన్నీ నా కళ్ల ముందే జరుగుతున్నాయి

## జగన్-షర్మిల ఆస్తుల వ్యవహారంపై విజయమ్మ బహిరంగ లేఖ

**పెన్ పవర్ డెస్క్:** వైకాపా అధినేత జగన్, ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మధ్య ఆస్తి పంపకాల వివాదం నేపథ్యంలో వారి తల్లి వైఎస్ విజయమ్మ స్పందించారు. ఈ మేరకు వైఎస్ఆర్ అభిమానులకు ఆమె బహిరంగ లేఖ రాశారు. "జరుగుతున్న సంఘటనలు చూస్తుంటే చాలా బాధేస్తోంది. జరగకూడనివన్నీ నా కళ్ల ముందే జరిగిపోతున్నాయి. ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడుతున్నారు. అబద్ధాల పరంపర కంటిన్యూ కాకూడదు. ఈ ఘటనలు నా పిల్లలిద్దరికే కాదు.. రాష్ట్రానికీ మంచిది కాదు" అని ఆవేదన వ్యక్తం చేశారు.

**సోషల్ మీడియాలో కల్పిత కథలు రాయొద్దు..**

"రాజశేఖర్ రెడ్డిని ప్రేమించే ప్రతి హృదయానికీ, ఈ కుటుంబాన్ని ఆదరించి అక్కున చేర్చుకున్న ప్రతి ఒక్కరికీ మీ విజయమ్మ చేస్తున్న అభ్యర్థన. ఇప్పుడు జరుగుతున్న ఘటనలు చూస్తుంటే మనసుకు చాలా బాధేస్తోంది. రాజశేఖర్ రెడ్డి, నేను, నా పిల్లలు చాలా సంతోషంగా ఉండేవాళ్లం. కానీ, నేడు అడ్డుకోవడానికి ఎంత ప్రయత్నించినా, జరగకూడనివన్నీ నా కళ్ళముందే జరుగుతున్నాయి. ఈ కుటుంబం గురించి ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు మాట్లాడుతున్నారు. అబద్ధాల పరంపర కొనసాగుతోంది. తెలిసి కొంత.. తెలియక కొంత మాట్లాడుతున్నారు. అవి దావానలంలా ఎక్కడెక్కడికో పోతున్నాయి. ఇవి కంటిన్యూ అవ్వొద్దు. నా పిల్లలిద్దరికే కాదు.. చెప్పాలంటే ఇది రాష్ట్రానికి కూడా మంచిది కాదు. ఈ విషయంపై నేను మీ ముందుకు రాకూడదని అనుకున్నా. కానీ, రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కుటుంబం గురించి తప్పుగా మాట్లాడే వారందరినీ ఒకటి

వివరాలు 2లో..





## రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 12 మంది మృతి

**పెన్ పవర్ డెస్క్:**రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సికార్ జిల్లాలో అతి వేగంగా దూసుకెళ్లిన ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపు తప్పి కల్వర్ట్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 12 మంది మృతి చెందగా.. మరో 40 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు సలాసర్ నుంచి సికర్ జిల్లాకు వస్తుండగా లక్ష్మణ్‌గఢ్ వద్దకు ఈ ప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారంతో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప

వివరాలు 2లో..



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్ట్ చేయాలె

- డ్రగ్స్ బయటపడ్డ ప్రతిసారి వాళ్లు మాట్లాడుతుండ్రు
- కేటీఆర్ కు అసలు బినామీ విజయ్ మద్దూరి
- కేసీఆర్ డీజీపీకి ఫోన్ చేసి ఇబ్బంది పెడ్తుండు

వివరాలు 2లో..

## డ్రోన్ సేవలు ప్రారంభించిన ప్రధాని మోదీ

- ఢిల్లీ నుంచి వర్చువల్ గా డ్రోన్ సేవలకు శ్రీకారం
- మంగళగిరి ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్ సీ వరకు వెళ్లిన డ్రోన్
- మహిళ బ్లడ్ శాంపిల్ తీసుకుని తిరిగొచ్చిన డ్రోన్
- 12 కిలోమీటర్ల దూరాన్ని 9 నిమిషాల్లో ప్రయాణించిన వైనం



**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ మంగళగిరిలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో డ్రోన్ సేవలను ప్రారంభించారు. ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో ఆయన డ్రోన్ సేవలు ప్రారంభిస్తూ బటన్ నొక్కారు. ఇదే కాకుండా, దేశంలోని మరో 10 ఎయిమ్స్ కేంద్రాల్లోనూ డ్రోన్ సేవలను ప్రధాని వర్చువల్ గా ప్రారంభించారు. బిలాస్ పూర్, రిషికేశ్, బీబీనగర్ (తెలంగాణ), గువాహటి, భోపాల్, జోధ్ పూర్, పాట్నా, రాయ్ బరేలీ,

వివరాలు 2లో..

## ఇడుపులపాయలో తండ్రి సమాధి వద్ద నివాళులు అర్పించిన జగన్

- ఇడుపులపాయ వచ్చిన జగన్
- ఘనస్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
- పులివెందులలో మూడ్రోజుల పాటు ఉండనున్న మాజీ సీఎం



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ బెంగళూరు నుంచి కడప జిల్లా ఇడుపులపాయ వచ్చారు. పార్టీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికాయి. జగన్ ఇడుపులపాయలోని వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. తండ్రి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం పులివెందుల బయల్దేరి వెళ్లారు. జగన్ తన సొంత నియోజకవర్గం పులివెందులలో మూడ్రోజుల పాటు కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటారు. జగన్ ఇడుపులపాయ పర్యటనకు సంబంధించిన ఫోటోలను మాజీ మంత్రి విడదల రజని సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## బోరుగడ్డ అనిల్ కు మరో 14 రోజుల రిమాండ్ పొడిగింపు

- బోరుగడ్డ అనిల్ కు నవంబరు 12 వరకు రిమాండ్
- రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్న పోలీసులు
- బాబుప్రకాశ్ అనే వ్యక్తిని రూ.50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో అనిల్ అరెస్ట్

వివరాలు 2లో..



**పెన్ పవర్ డెస్క్:** వైసీపీ సానుభూతిపరుడు బోరుగడ్డ అనిల్ కు న్యాయస్థానం మరోసారి రిమాండ్ పొడిగించింది. ఇటీవల 14 రోజుల రిమాండ్ విధించిన గుంటూరు న్యాయస్థానం... తాజాగా మరో 14 రోజుల రిమాండ్ పొడిగిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. దాంతో బోరుగడ్డ అనిల్ నవంబరు 12 వరకు రిమాండ్ లో

## ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభం

- దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం కోసం బుకింగ్ షురూ
- ప్రతి 4 నెలలకొక సిలిండర్ చొప్పున ఏటా 3 ఉచిత సిలిండర్ల పంపిణీ
- ఆధార్, రేషన్ కార్డు ఉన్న ప్రతి వినియోగదారుకూ రూ. 851 రాయితీ
- వినియోగదారుడు చెల్లించిన 48 గంటల్లో బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ

వివరాలు 2లో..



## రూ.50 కోట్లు దారి మళ్లాయ్..! మళ్లీ తెరపైకి ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారం



**పెన్ పవర్ డెస్క్:**ఫార్ములా ఈ రేసింగ్ వ్యవహారం మరోమారు తెరపైకి వచ్చింది. ఈ కేసులో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ ఫోన్లో ఇచ్చిన ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ రూ.55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడం గమనార్హం. ఈ వ్యవహారంపై మున్సిపల్ అధికారులు ఏసీబీకి ఫిర్యాదు చేశారు. విచారణకు అనుమతించాలని కోరుతూ ఏసీబీ ప్రభుత్వానికి లేఖ రాసింది. పోటీల

వివరాలు 2లో..

## పేర్లు డైరీలో రాసి పెడ్తున్నం

### పోలీసులకు హరీష్ రావు వార్నింగ్

**పెన్ పవర్ డెస్క్:** ప్రభుత్వ అండతో అక్రమ కేసులు పెడుతూ కొందరు పోలీసులు లిమిట్‌దాటి వ్యవహరిస్తున్నారు. వారి పేర్లు డైరీల్లో రాసిపెడుతున్నామని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మాపై అక్రమ కేసులు పెడితే భయపడేది లేదన్నారు. వనపర్తిలో రైతు ప్రజా నిరసన సదస్సుకు హాజరై హరీశ్‌రావు మాట్లాడారు..

వివరాలు 2లో..



## జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారింది



- ఎన్నికల ముందు హడావిడిగా ప్రాజెక్టును జాతికి అంకితం చేశారన్న మంత్రి
- పనులు అప్పగించి, అవి పూర్తికాకుండానే నిధులు కట్టబెట్టారని విమర్శ
- ఒక్క గ్రామానికి కూడా పునరావాస కాలనీలు నిర్మించిన పాపాన పోలేదని ఆగ్రహం

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# మరో యుద్ధం తప్పదా....

పశ్చిమాసియాలో ప్రతికార యుద్ధం పీక్స్‌కు చేరుకుంది. గొలుసులా కొనసాగుతున్న పరిణామాల మధ్య యుద్ధంలో చివరి అంకం మొదలైనట్లే కనిపిస్తోంది. దాదాపు ఐదు దేశాల్లోని మిలీషియాతో తలపడుతున్న ఇజ్రాయెల్.. చివరిగా ఇరాన్‌పై దృష్టి పెట్టింది. 45 ఏళ్ల తర్వాత ఇరాన్‌కు ఇజ్రాయెల్‌కు మధ్య ప్రత్యక్ష యుద్ధం షురూ అయ్యిందనే సూచనలు కనిపిస్తున్నాయి. మొత్తానికి మిడిల్ ఈస్ట్, అత్యంత భయంకరమైన పరిస్థితుల మధ్య అల్లాడుతోందిమిడిల్ ఈస్ట్‌లో ప్రధాన ప్లేయర్ల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ రెండు దేశాలూ తలపడితే మధ్య ప్రాచ్యం మసై పోతుందేమో అనే అనుమానాలు ఇప్పుడు మరింత ఎక్కువయ్యాయి. అక్టోబరు 1న, ఇరాన్ ఇజ్రాయెల్‌పై ప్రయోగించిన క్షిపణి దాడికి 25 రోజుల తర్వాత ఇజ్రాయెల్ ప్రతిస్పందించింది. ఇరాన్‌పై "ఖచ్చితమైన దాడులు" అనే పేరుతో అక్టోబర్ 26 తెల్లవారుజామున బాంబుల వర్షం కురిపించింది. గత కొన్ని నెలలుగా ఇరాన్ ఇజ్రాయెల్‌పై చేస్తున్న నిరంతర దాడులకు ప్రతిస్పందనగా.. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్, ఇరాన్ సైనిక స్థావరాలే లక్ష్యంగా దాడులు నిర్వహిస్తుందని ఒక ప్రకటనలో ఇజ్రాయెల్ మిలిటరీ వెల్లడించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని సైనిక స్థావరాలపై సూర్యోదయానికి ముందే ఇజ్రాయెల్ దాడి ముగిసింది. ఇరాన్‌లోని సైనిక లక్ష్యాలపై ఖచ్చితమైన దాడులను నిర్వహించడం ద్వారా ప్రస్తుతానికి ఇజ్రాయెల్ సైన్యం లక్ష్యం నెరవేరిందని పేర్కొంది. అక్టోబరు 1న, ఇరాన్ ఇజ్రాయెల్‌పై దాదాపు 180 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించింది. వీటిలో చాలా క్షిపణులను అమెరికా దళాల సహాయంతో నిర్మించిన ఇజ్రాయెల్ వైమానిక రక్షణ వ్యవస్థ కూల్చివేసింది. అయితే, ఇరాన్ చేసిన ఆ దాడి? లెబనాన్‌లోని హిజ్బుల్లాకు, ఇరాన్‌కు వ్యతిరేకంగా ఇజ్రాయెల్ చేసిన వరుస దాడులకు ప్రతిస్పందనగా చేసినట్లు ఇరాన్ పేర్కొంది. అలాగే, హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లాను వైమానిక దాడిలో చంపేసింది ఇజ్రాయెల్. ఆ తర్వాత, సరిహద్దుల గుండా దక్షిణ లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ సైన్యాన్ని పంపింది. లెబనాన్‌పై కూడా వైమానిక దాడులు తీవ్రతరం చేసింది. ఈ దాడుల్లో హిజ్బుల్లాను తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా పెట్టుకుంది. దీనితో లెబనాన్‌లో వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఆకస్మిక దాడులతో లెబనాన్ అల్లకల్లోలం అయ్యింది., ఈ ఏడాది ఏప్రిల్‌లో కూడా ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణులతో దాడులు చేసింది. దశాబ్దాలుగా ఇజ్రాయెల్‌పై దాడులు చేయడానికి ఇరాన్ ప్రాక్సీలుగా మిడిల్ ఈస్ట్‌లోని పలు తీవ్రవాద గ్రూపులను వినియోగించుకుంటుంది. అయితే, ఇటీవల కాలంలో ఇరాన్ నేరుగా ఇజ్రాయెల్‌పై చేసిన దాడి మాత్రం ఏప్రిల్ నెలలోనే జరిగింది. నిజానికి, ఇజ్రాయెల్‌పై పాలస్తీనా మిలిటెంట్ గ్రూప్ హమాస్ ఆకస్మిక దాడి ప్రారంభించిన మరుసటి రోజు, అంటే, గతేడాది అక్టోబర్ 8 నుండి ఇజ్రాయెల్, హిజ్బుల్లా సరిహద్దు కాల్పుల యుద్ధంలో ఉన్నారు. యుద్ధం తీవ్రమయ్యి గాజాలో ఇజ్రాయెల్ దాడులపై అంతర్జాతీయంగా విమర్శలు కూడా వచ్చాయి. గాజా స్ట్రిప్‌ని బాంబులతో జల్లెడ పట్టిండి ఇజ్రాయెల్. పదుల సంఖ్యలో హమాస్ అగ్ర నాయకత్వాన్ని అంతం చేస్తూ వచ్చింది. అయితే, హమాస్‌కు సంఘీభావంగా లెబనాన్ కేంద్రంగా నడుస్తున్న హిజ్బుల్లా ఇజ్రాయెల్‌పై రాకెట్లను కాల్చడం ప్రారంభించింది. దీనితో, కొన్ని రోజులు ఇజ్రాయెల్-హిజ్బుల్లా యుద్ధం భీకరంగా కొనసాగింది. ఇక, ఇరాన్ బ్యాకప్‌గా ఉన్న ఈ గ్రూపులపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో అప్పుడప్పుడు ఇరాన్ కూడా కలుగజేసుకుంటూ ఉంది. అదే, తాజాగా ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేయడానికి కారణం అయ్యిందియుద్ధం మొదలైనప్పటి నుండీ ఇజ్రాయెల్‌కు అమెరికా సహకారం ఎక్కువగా ఉంది. ఎర్రసముద్రంలో ఇజ్రాయెల్‌కు వెళ్లి వచ్చే ఓడలపై దాడి చేస్తున్న హౌతీ తీవ్రవాదులను ఎదుర్కోవడం దగ్గర నుండీ ఇజ్రాయెల్‌కు ఆయుధ సహకారం, సైనిక శిక్షణా సహకారం వంటివి అందిస్తూనే ఉంది. అయితే, ఇరాన్‌పై చేస్తున్న దాడుల్లో మాత్రం అమెరికా నేరుగా పాల్గొనలేదని పేర్కొంది. అయితే, యూఎస్ ప్రెసిడెంట్ బైడెన్, ఇతర ఉన్నతాధికారులు ఇజ్రాయెల్ చేస్తున్న నిర్ధిష్ట లక్ష్య దాడులను కొనసాగించమని ప్రోత్సహిస్తున్నారు. ఇరాన్‌పై తాజా దాడి కూడా అందులో భాగంగానే జరిగినట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, ఈ దాడులకు ఇరాన్ ప్రతిస్పందిస్తే, దాని నుండి ఇజ్రాయెల్‌ని రక్షించడానికి యునైటెడ్ స్టేట్స్ సిద్ధంగా ఉందని, ఇజ్రాయెల్ వైమానిక రక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడానికి అధికారులు రెడీ ఉన్నారని అమెరికా వెల్లడించింది. ఇజ్రాయెల్ తాజాగా చేసిన దాడులను ఇరాన్ రక్షణ వ్యవస్థ అడ్డుకున్నట్లు ఇరాన్ పేర్కొంది. దీనివల్ల "పరిమిత నష్టం" మాత్రమే జరిగిందని ఇరాన్ వెల్లడించింది. అక్టోబర్ 26 తెల్లవారుజామున ఇరాన్ వ్యాప్తంగా సైనిక కేంద్రాలపై ఇజ్రాయెల్ దాడి చేసినట్లు తెలిపింది. టెహ్రాన్, ఖుజెస్తాన్, ఇలాం ప్రావిన్సులలోని సైనిక కేంద్రాలలోని కొన్ని భాగాలపై ఈ దాడి జరిగినట్లు ఇరాన్ నివేదించింది. "ఈ దాడిని ఇరాన్ సమగ్ర వాయు రక్షణ వ్యవస్థ విజయవంతంగా అడ్డుకుందని వెల్లడించింది. టెహ్రాన్‌తో పాటు దేశం చుట్టూ అనేక ప్రాంతాలలో వైమానిక రక్షణను మోహరించినట్లు ఇరాన్ అధికారులు చెప్పారు. అయితే, "ఇటీవల కాలంలో ఇరాన్ చేసిన దాడులకు ప్రతిస్పందన ఈ తాజా దాడితో ముగిసిందనీ.. ఇజ్రాయెల్‌కు ఉన్న తక్షణ బెదిరింపులను అడ్డుకున్నామని" ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ వెల్లడించింది. "ఇక ఇరాన్ కొత్తగా మరో రౌండ్ దాడులు ప్రారంభిస్తే.. ఇజ్రాయెల్ మరింత తీవ్రంగా ప్రతిస్పందస్తుందని" హెచ్చరికలు కూడా చేశారు. ఈ విషయంలో ఇజ్రాయెల్ స్పష్టంగా ఉందనీ.. ఇజ్రాయెల్‌ను ఇంకా ఎవరైనా బెదిరించే ప్రయత్నం చేసినా.. ఈ యుద్ధాన్ని ఇంకా విస్తరించాలని కోరుకున్న పరిణామాలు తీవ్రంగా ఉంటాయని పేర్కొంది. ఇజ్రాయెల్‌కు హాని కలిగించాలని కోరుకునే వారందరూ దానికి భారీ మూల్యం చెల్లించవలసి ఉంటుందని వెల్లడించారు. "నిర్ణయాత్మకంగా వ్యవహరించే సామర్థ్యం, సంకల్పం రెండూ ఇజ్రాయెల్ దగ్గర ఉన్నాయని ఈ రోజు నిరూపించమని" అన్నారు. ఇజ్రాయెల్ ప్రజలను రక్షించడానికి ఎలాంటి నేరమైన చేస్తామని, ఇజ్రాయెల్ ప్రజల రక్షణ కోసం సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

# రగకూడనివన్నీ నా కళ్ల ముందే జరుగుతున్నాయి

- మొదటి పేజీ తరువాయి

అడుగుతున్నా... ఈ కుటుంబాన్ని ప్రేమించిన వారు మీరు. మా జీవితంలో మీరందరూ భాగమే అనుకుంటున్నాను. ఇది రాజశేఖర్ రెడ్డి కుటుంబం. ఆయనకు మేమెంతో.. మీరూ అంతే. ఆయన మమ్మల్ని ఎలా ప్రేమించారో.. మిమ్మల్ని అంతగానే ప్రేమించారు. మీరూ అంతకంటే ఎక్కువగా మా కుటుంబాన్ని ప్రేమించారు.

అంతెందుకు.. రాజశేఖర్ రెడ్డి మన మధ్య నుంచి వెళ్లిపోయాక నా పిల్లలను ఆయన ఉన్నప్పటి కంటే ఎక్కువగా ఆదరించి అక్కున చేర్చుకున్నారు. అది నేనెప్పటికీ మరిచిపోలేను. అందుకు నా జన్మంతా మీకు రుణపడి ఉంటూ.. హృదయ పూర్వకంగా నా కృతజ్ఞతలు చెబుతున్నాను. మీ అందరికీ మీ ఆడబిడ్డగా రెండు చేతులెత్తి మనవి చేసుకుంటున్నా. దయచేసి ఈ కుటుంబం గురించి, నా పిల్లల గురించి తక్కువ చేసి మాట్లాడొద్దని కోరుతున్నా. ముఖ్యంగా సోషల్ మీడియాలో కల్పిత కథలు రాయొద్దు. దూషణలు చేయవద్దు. ఈ కుటుంబం పట్ల నిజమైన ప్రేమ ఉంటే.. ఇంతకంటే ఎక్కువ మాట్లాడవద్దు. మీరెవరూ రెచ్చగొట్టవద్దని నా మనవి.

**వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి అసత్యాలు చెప్పారు..**

ఇటీవల వైవీ సుబ్బారెడ్డి, విజయసాయిరెడ్డి తదితరులు మాట్లాడుతున్నది.. వాళ్లు ప్రేమించే వైఎస్ఆర్ గురించేనని మరిచారు. తీస్తున్నది ఆయన కుటుంబ పరువు అనే స్పృహ లేకుండా.. ఎన్నో అసత్యాలు చెప్పారు. ఆయన బతికి ఉండగానే ఆస్తులు పంచేశారని అన్నారు. ఇది అవాస్తవం. వైఎస్ఆర్ పిల్లలిద్దరూ పెరుగుతున్న రోజుల నుంచి కొన్ని ఆస్తులు పాప పేరు మీద.. అలాగే కొన్ని ఆస్తులు జగన్ పేరు మీద పెట్టారు. అది ముమ్మాటికీ ఆస్తులు పంచడం కాదు. వైఎస్ఆర్ బతికి ఉండగానే షర్మిలకు ఆస్తులు ఇచ్చేశారు అని లిస్ట్ చదివారు. అలాగే, జగన్ పేరు మీద పెట్టిన ఆస్తుల లిస్ట్ చదివి ఉండాల్సింది. వైఎస్ఆర్ చేసింది పంపకం కాదు. కొన్ని ఆస్తులు ఇద్దరు బిడ్డల పేరు మీద పెట్టారు.. అంతే. విజయసాయి రెడ్డి ఆడిటర్‌గా ఉన్నారు గనక ఆయనకు అన్నీ తెలుసు. వైవీ సుబ్బారెడ్డి ఈ ఇంటి బంధువుగా ఎంవోయూపై సాక్షి సంతకం చేశారు. అయినా.. మీడియాలో అవాస్తవాలు మాట్లాడటం నాకు చాలా బాధ కలిగించింది. అబద్ధాల పరంపర కొనసాగకుండా ఉండటానికి సూటిగా నిజం చెబుతున్నా. వీరిద్దరూ నా పిల్లలు. ఇద్దరినీ వైఎస్ఆర్, నేను ఎంతో అపురూపంగా, ప్రేమగా పెంచుకున్నాం. అమ్మగా నాకు ఇద్దరూ సమానమే. రాజశేఖర్ రెడ్డి మాట ప్రకారం.. ఆస్తులు కూడా ఇద్దరికీ సమానం. ఇదే నిజం. నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా ఉండాలన్న వైఎస్ఆర్ ఆజ్ఞ నిజం. అస్తులు వృద్ధిలోకి తేవడంలో జగన్ కష్టం ఉందనేది నిజం. కానీ అన్ని ఆస్తులూ కుటుంబ ఆస్తులే అన్నది నిజం. జగన్ బాధ్యత కలిగిన కుమారుడిగా కుటుంబ ఆస్తులను సంరక్షించాలన్నది కూడా నిజం.

**వైఎస్ఆర్‌కు జగన్ ఇచ్చిన మాట ఇదీ..**

వైఎస్ఆర్ చివరి రోజుల్లో జగన్ ఆయనకు ఇచ్చిన మాట "నాన్నా.. నీ తర్వాత ఈ లోకంలో పాప మేలు కోరే వారిలో నేను మొదటి వాడిని" అని చెప్పింది కూడా నిజం. ఇది "నాలో నాతో వైఎస్ఆర్ అనే పుస్తకం"లో ఎప్పుడో రాశా. రాజశేఖర్ రెడ్డి బతికి ఉండగా ఆస్తులు పంచలేదు. ఉన్న ఆస్తులను ఒక్కొక్కరు చూసుకున్నారు. అందరం కలిసి ఉన్నాం. అన్నీ కుటుంబ ఆస్తులే. ఇక పంచుదాం అనుకొనే సరికి, ఆయన ప్రమాదంలో వెళ్ళిపోయారు. ఈ విషయం ఆడిటర్‌గా విజయసాయి రెడ్డికి స్పష్టంగా తెలుసు. తెలిసీ కూడా అవాస్తవాలు మాట్లాడారు. రాజశేఖర్ రెడ్డి మన మధ్య నుంచి వెళ్ళిపోయాక.. 2009 నుంచి 2019 వరకు పదేళ్లు కలిసి ఉన్నారు. డివిడెండ్ రూపంలో జగన్ వాటా తీసుకొని, రూ.200 కోట్లు షర్మిల భాగానికి ఇచ్చారు. ఎంవోయూ ప్రకారం జగన్ 60 శాతం.. పాపకు 40 శాతం అయితే, ఎంవోయూకు ముందు సగం సగం డివిడెండ్ తీసుకొనే వారు. ఎందుకంటే పాపకు సమాన వాటా ఉంది కాబట్టి. వీటన్నింటికీ అప్పుడు, ఇప్పుడూ నేనే సాక్షిని. 2019లో జగన్ సీఎం అయిన రెండు నెలలకు డివైడ్ అవ్వాలని ఇజ్రాయిల్‌లో జగన్ ప్రపోజల్ పెట్టాడు. జగన్ చెప్పింది ఏంటంటే... "పిల్లలు పెద్ద వాళ్ళు అయ్యారు.. నాకు అల్లుళ్లు వస్తారు. నీకు అల్లుడు, కోడలు వస్తారు... మనం కలిసి ఉన్నట్లు వాళ్లు కలిసి ఉండకపోవచ్చు. కాబట్టి విడిపోదాం" అన్నాడు. అలా 2019 వరకు కలిసి ఉన్న కుటుంబం, ఆస్తులు పరంగా విడిపోవాలని నిర్ణయం జరిగింది.

**విజయవాడలో ఆస్తుల పంపకం జరిగిందిలా...**

ఆ తర్వాత విజయవాడలో నా సమక్షంలోనే ఆస్తుల్లో ఇవి జగన్‌కి, ఇవి షర్మిలకి అని అనుకున్నారు. 2019లో అప్పుడు రాసిన ఎంవోయూనే ఈ ఎంవోయూ. ఇది జగన్ నోటితో చెప్పి.. ఆయన చేతితో రాసిన ఎంవోయూనే ఇది. హక్కు ఉంది గనకే షర్మిలకు రూ.200 కోట్ల డివిడెండ్లు ఇచ్చారు. పాపకి హక్కు ఉంది గనకే అధికారికంగా ఎంవోయూ రాసుకున్నారు. అందులో షర్మిలకు ఇవ్వాల్సిన ఆస్తులు జగన్ గిఫ్ట్‌గా ఇస్తున్నవి కాదు. జగన్ బాధ్యతతో ఇస్తున్నవి. అటాచ్‌మెంట్‌లో లేవు కాబట్టి ఎంవోయూలో ఉన్న సరస్వతి షేర్స్ 100 శాతం, ఎలహంక ప్రాపర్టీ 100 శాతం పాపకు వెంటనే ఇస్తానని జగన్ అప్పుడే మాట ఇచ్చి సంతకం పెట్టాడు. ఇవి కూడా ఇవ్వకుండా.. ఆటాచ్‌మెంట్‌లో లేని ఆస్తుల విషయంలోనూ పాపకు అన్యాయం జరిగింది. పాప భాగానికి వచ్చిన భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, వైఎస్ఆర్ ఇల్లు.. ఇలాంటివి కేసుల తర్వాత ఇవ్వాల్సి ఉంది. 2019వరకు కలిసే ఉన్నాం. షర్మిలను బిజినెస్‌లో ఇన్వాల్వ్ చేయలేదు.

**అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండటం నా ధర్మం..**

అయినా, షర్మిల పాలిటిక్స్‌లో జగన్ చెప్పినట్లు చేసింది. జగన్ కోసం నిస్వార్థంగా కష్టపడింది. అధికారంలో రావడానికి ఆమె కృషి ఎంతో ఉంది. జన్మనిచ్చిన ప్రతి తల్లిదండ్రులకు బిడ్డలందరూ సమానమే. ఒక బిడ్డ ఇంకో బిడ్డకు అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం చాలా కష్టం. తల్లిగా, అన్యాయం జరిగిన బిడ్డ పక్షాన ఉండి మాట్లాడటం నా విధి, ధర్మం. ఇంత మంది పెద్ద మనుషులు చెబుతున్న అబద్ధాల మధ్య నిజం తెలియాలనే ఇన్ని విషయాలు చెప్పాల్సి వచ్చింది. వాస్తవాలు ఇవే.. అయినప్పటికీ, వాళ్లు ఇద్దరూ అన్నాచెల్లెళ్ళు. ఇది వాళ్ళిద్దరి సమస్య. ఈ సమస్యను వారే పరిష్కరించుకుంటారు. రాజశేఖర్‌రెడ్డి ఉండి ఉంటే ఈ ఆస్తుల సమస్య ఉండేది కాదు. ఇంతటి వివాదం జరిగేది కాదు. ఆస్తుల విషయంపై నేనూ ఇలా రావాల్సిన అవసరం పడేది కాదు. ప్రస్తుతం జరుగుతున్న రచ్చను చూసి.. నా మాటలు మాత్రమే ఆపుతాయని విశ్వసిస్తున్నా. నేను రాకపోతే ఇలానే కొనసాగుతుందని.. మీ ముందుకు రావాల్సి వచ్చింది. ఇష్టం వచ్చినట్లు మాట్లాడొద్దని మరోసారి మీ అడబిడ్డగా ప్రతి ఒక్కరినీ కోరుకుంటూ.. ఇట్లు, ప్రేమతో, వైఎస్ విజయ రాజశేఖర్ రెడ్డి" అని తన లేఖలో పేర్కొన్నారు.

# బోరుగడ్డ అనిల్ కు మరో 14 రోజుల రిమాండ్ పొడిగింపు

- మొదటి పేజీ తరువాయి

ఉండనున్నాడు. పోలీసులు బోరుగడ్డ అనిల్ ను రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

గుంటూరులో కర్లపూడి బాబుప్రకాశ్ అనే వ్యక్తిని రూ.50 లక్షలు డిమాండ్ చేసిన కేసులో బోరుగడ్డ అనిల్ ను పోలీసులు అరెస్ట్ చేయడం తెలిసిందే. ఇటీవలే కోర్టు మూడు రోజులు కస్టడీకి అనుమతించడంతో, గుంటూరు పోలీసులు అనిల్ ను ప్రశ్నించారు. ఇతర ఆరోపణలకు సంబంధించి కూడా అతడిని ప్రశ్నించినట్టు సమాచారం. అయితే, జగన్ ఎవరో తనకు తెలియదని అతడు పోలీసు విచారణలో చెప్పినట్టు తెలుస్తోంది.

అటు, బీజేపీ నేత, ఏపీ మంత్రి సత్యకుమార్ యాదవ్ పై గతేడాది మార్చి 31న జరిగిన దాడికి సంబంధించి బోరుగడ్డ అనిల్ పై మరో కేసు కూడా నమోదైంది. ఈ దాడి కేసులో వైసీపీ మాజీ ఎంపీ నందిగం సురేశ్ ఏ1గా, బోరుగడ్డ అనిల్ ఏ2గా ఉన్నారు.

# బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు డ్రగ్స్ టెస్ట్ చేయాలె

**పెన్ పవర్ డెస్క్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరికీ డ్రగ్స్ టెస్ట్ చేయాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. ఇవాళ ఆయన గాంధీభవన్ లో మీడియాతో మాట్లాడుతూ.. డ్రగ్స్ వ్యవహారం బయటికొచ్చిన ప్రతి సారి ఆ పార్టీ ఎమ్మెల్యేలు బయటికి వచ్చి మాట్లాడుతున్నారని ఆరోపించారు. సిగ్గు, శరం ఉంటే డ్రగ్స్ టెస్ట్ చేసుకోవాలని డిమాండ్ చేశారు. రాజ్ పాకాలా, విజయ్ మద్దూరిని వెనకేసుకు రావడానికి కేటీఆర్ కు సిగ్గుండాలని ఫైర్ అయ్యారు. విజయ్ మద్దూరి కేటీఆర్ బినామీ అని అనిల్ కుమార్ యాదవ్ ఆరోపించారు. గత ప్రభుత్వం డ్రగ్స్ కేసును ఎలా దారి మ ళ్లించిందో అందరికీ తెలుసన్నారు. జన్వాడ పామ్ హౌస్ అంటే నే కాంట్రవర్సీ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం డ్రగ్స్ ఫ్రీ రాష్ట్రంగా చేస్తుంటే.. వాళ్ళు డ్రగ్స్ ని ప్రేరేపించాలని చూస్తున్నారని విమర్శించారు. తెలంగాణను కేసీఆర్ కుటుంబం ఏం చేయాలనుకుంటుందో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజ్ పాకాల తనకు డ్రగ్స్ ఇచ్చారని విజయ్ ఒప్పుకున్నారని చెప్పారు. ఇప్పుడు స్టేట్ మెంట్ మార్చుతున్నారని మండిపడ్డారు. ఫాంహౌస్ దొర కేసీఆర్ డీజీపీకి ఫోన్ చేసి ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ఈ కేసులో ఆయన పర్సనల్ ఇంట్రెస్ట్ ఏమిటో అర్థం కావడం లేదన్నారు. కేసీఆర్ బయటికి రావాలని, ఆయన ఎక్కడ ఉన్నారని ప్రజలు అడుతున్నారని అన్నారు.

# జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారింది

**పెన్ పవర్ డెస్క్:** మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి నిమ్మల రామానాయుడు వెలిగొండ ప్రాజెక్టు విషయమై తీవ్ర విమర్శలు గుప్పించారు. జగన్ పాలన వెలిగొండ ప్రాజెక్టుకు శాపంగా మారిందని దుయ్యబట్టారు. ఎన్నికల ముందు హడావిడిగా ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని విమర్శించారు. పనులు అప్పగించి, అవి పూర్తికాకుండానే నిధులు కట్టబెట్టారని ఆరోపించారు. 10 క్యూసెక్కులు కూడా లేకుండానే ప్రాజెక్టు ప్రారంభోత్సవం అంటూ ఊదరగొట్టారని మండిపడ్డారు. ఒక్క గ్రామానికి కూడా పునరావాస కాలనీలు నిర్మించిన పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత టీడీపీ పాలనలో ప్రాజెక్టుకు రూ. 1,373 కోట్లు కేటాయించి, రూ.1,319 కోట్లు ఖర్చు చేశామని మంత్రి నిమ్మల ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ ప్రాజెక్టుకు వెళ్లినా జగన్ విధ్వంసమే కనిపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

# రూ.50 కోట్లు దారి మళ్లాయ్..!
## మళ్లీ తెరపైకి ఫార్ములా ఈ-కార్ రేసింగ్ వ్యవహారం

- మొదటి పేజీ తరువాయి

నిర్వహణకు ఏక పక్షంగా చెల్లింపులు జరగడం, ఆర్బీఐ అనుమతి తీసుకోకుండా విదేశీ సంస్థకు నిధులు బదిలీ చేయడంపై మున్సిపల్ శాఖ ఫిర్యాదు చేసింది.

గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్‌పై ఫార్ములా ఈ రేసింగ్‌ను నిర్వహించారు. హుస్సేన్ సాగర్ చుట్టూ 2.8 కిలో మీటర్ల ట్రాక్ నిర్మించి ఫిబ్రవరి 11వతేదీ 2023న మొదటిసారి ఫార్ములా ఈ రేసింగ్ నిర్వహించారు. ఆ తర్వాత 2024 ఫిబ్రవరి10న నిర్వహించేందుకు ఫార్ములా ఈ ఆపరేషన్‌తో బీఆర్ఎస్ ప్రభుత్వం గతేడాది అక్టోబర్‌లో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా హెచ్ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు సదరు సంస్థకు బదిలీ అయ్యాయి. డిసెంబర్‌లో ఆ పార్టీ అధికారం కోల్పోయింది. సర్కారు నిబంధనలు పాటించకపోవడంతో హైదరాబాద్‌లో ఈ రేస్ నిర్వహించడం

లేదని ఎఫ్ఈవో ప్రకటించింది. అప్పటి కేబినెట్ అప్రూవల్ లేకుండా, కేవలం అప్పటి మంత్రి కేటీఆర్ ఫోన్‌లో ఇచ్చిన ఆదేశాలతో రూ.55 కోట్లు విదేశీ సంస్థకు విడుదల చేయడం గమనార్హం. ఈ అంశం కలకలం రేపింది.

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా డబ్బును విదేశీ సంస్థకు విడుదల చేయడం దుమారం రేపుతోంది. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు అవినీతి నిరోధక శాఖకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం అనుమతిస్తే ఏం జరుగుతుందో అనేది హాట్ టాపిక్‌గా మారింది.

# డ్రోన్ సేవలు ప్రారంభించిన ప్రధాని మోదీ

- మొదటి పేజీ తరువాయి

ఇంఫాల్, రాయ్ పూర్ ఎయిమ్స్ కేంద్రాల్లోనూ డ్రోన్లను ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ఈ క్రమంలో, మంగళగిరి ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్ సీ (ప్రజా ఆరోగ్య కేంద్రం) వరకు డ్రోన్ ను పంపారు. పీహెచ్ సీలో ఓ మహిళకు చెందిన బ్లడ్ శాంపిల్ తో డ్రోన్ ఎయిమ్స్ కు తిరిగొచ్చింది. మంగళగిరి ఎయిమ్స్ నుంచి నూతక్కి పీహెచ్ సీకి 12 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ దూరాన్ని డ్రోన్ 9 నిమిషాల్లో ప్రయాణించింది. రోగులకు మెరుగైన వైద్య సేవలు, బ్లడ్ శాంపిల్స్ సేకరణలో డ్రోన్ల వినియోగంపై ఈ మేరకు ప్రయోగాత్మకంగా పరిశీలించారు.

# ఏపీలో ఉచిత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభం

**పెన్ పవర్ డెస్క్:** ఏపీలో దీపావళి కానుకగా ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం కోసం బుకింగ్ ప్రారంభమైంది. ప్రతి నాలుగు నెలలకొక సిలిండర్ చొప్పున ఏటా మూడు ఉచిత సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఆధార్, రేషన్ కార్డు ఉన్న ప్రతి వినియోగదారుకూ రూ. 851 రాయితీ రానుంది. వినియోగదారుడు చెల్లించిన 48 గంటల్లో బ్యాంకు ఖాతాకు నగదు బదిలీ అవుతుంది. నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు మొదటి సిలిండర్ బుకింగ్స్ ప్రారంభమయ్యాయి.

# రాజస్థాన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. 12 మంది మృతి

- మొదటి పేజీ తరువాయి

ఆసుపత్రులకు తరలించారు. సాలాసర్ నుంచి వస్తున్న ప్రైవేట్ బస్సు అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని సికార్ జిల్లా ఎస్పీ భువన్ భూషణ్ యాదవ్ తెలిపారు. మంగళవారం (అక్టోబర్ 29) మధ్యాహ్నం 2 గంటల సమయంలో యాక్సిడెంట్ జరిగినట్లు ఆయన వెల్లడించారు. బస్సు ప్రమాదంలో 12 మంది మరణించారని.. పెద్ద సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారని పేర్కొన్నారు. క్షతగాత్రులను లక్ష్మణ్‌గఢ్, సికార్‌లోని ఆసుపత్రులకు తరలించామని తెలిపారు. కాగా, బస్సు ప్రమాదం జరిగిన ఘటన స్థలంలో దృశ్యాలు భయానకంగా ఉన్నాయి. ప్రమాద తీవ్రతకు బస్సు ముందుగ భాగం మొత్తం నుజ్జునుజ్జు అయ్యింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

**రాజస్థాన్ సీఎం సంతాపం:**

సికార్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి సరైన చికిత్స అందించాలని సంబంధిత అధికారులకు వెంటనే ఆదేశాలు జారీ చేశారు. సికార్‌లోని లక్ష్మణ్‌గఢ్ ప్రాంతంలో జరిగిన బస్సు ప్రమాదంలో ప్రాణనష్టం చాలా బాధాకరమని.. హృదయ విదారకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి త్వరగా కోలుకోవాలని ఈ సందర్భంగా సీఎం ఆకాంక్షించారు.

# పేర్లు డైరీలో రాసి పెడ్తున్నం

- మొదటి పేజీ తరువాయి

ఇప్పటివరకు 20 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ అయిందన్నారు. రేవంత్‌రెడ్డి వచ్చాక పాత స్కీంలను ఆపేశారన్నారు. రుణమాఫీ చేయలేదు. నన్ను రాజీనామా చేయమంటున్నారని ఫైర్‌అయ్యాడు. 'ఎనముల రేవంత్ కాదు.. ఎగవేతల రేవంత్. ఢిల్లీకి మూటలు పంపేందుకు.. లక్షా 50 వేల కోట్లతో మూసీ సుందరీకరణకు డబ్బులిచ్చే సీఎంకు రైతులకు రైతుభరోసా ఇచ్చేందుకు నిధులు లేవా..? రైతుబంధు ఇవ్వని కాంగ్రెస్‌ను ఉరికించాలి. పత్తి రైతులకు మద్దతు ధర లేక రైతులు అవస్థలు పడుతున్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో అనేక హామీలు ఇచ్చారు. సీఎం వచ్చిన తర్వాత బతుకమ్మ చీరలను ఆపేశారు. డెడ్ లైన్లు మారాయి.. పత్రికల్లో హెడ్ లైన్లు మారాయి.. కాని రైతు రుణమాఫీ మాత్రం ఓ లైన్ రాలేదు.

సర్కార్ దవాఖానాల్లో మందులు కూడా లేవు. 29 జీవోతో నిరుపేద నిరుద్యోగులకు తీవ్ర నష్టం కలుగుతుంది. రాష్ట్రంలో ప్రజాపాలన కాదు. పోలీసు పాలన సాగుతోంది. సీఎంకు పాలన మీద పట్టు లేదు. బీఆర్ఎస్ పోరాటంతోనే కరెంట్ బిల్లులు పెరగలేదు. వచ్చే అసెంబ్లీలో ప్రభుత్వం మెడలు వంచుతాం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కు బుద్ధి చెప్పాలి' అని హరీష్ రావు అన్నారు.

# బాలినేనితో రజనీ రాయబేరం



**గుంటూరు, అక్టోబరు 29, పెన్ పవర్:** రాజకీయాలు ఎప్పుడు ఎవరిని ప్రత్యర్థులుగా మారుస్తాయో, విడిపోయిన నేతలు తిరిగి ఎప్పుడు కలుస్తారో తెలియదు. బద్ధ శత్రువులుగా ఒకరిపై ఒకరు మాటల దాడులు చేసుకున్న నేతలు ఏదో ఒక సందర్భంలో కలిపోతారు. ఏపీలో రాజకీయాలు ప్రస్తుతం హాట్ హాట్ గా నడుస్తున్నాయి. మొన్నటిదాకా తిరుగులేని అధికారాన్ని సొంతం చేసుకుని వైనాట్ వన్ సెవంటీ ఫైవ్ అంటూ దాదాపు మళ్లీ అధికారంలోకి వచ్చేసినంతగా ప్రచారం చేసుకున్న వైసీపీ నేత జగన్ కనీసం ప్రతిపక్ష హోదాకి తగినంత బలం లేనంతగా ఓటమి పాలయ్యారు. అధికారం కోల్పోయాక గత నాలుగు నెలలుగా రాష్ట్రంలో ఏ సమస్య వచ్చినా జగన్ ఒంటరి పోరాటమే చేస్తున్నారు. జగన్ కు అప్పట్లో అండగా నిలిచిన మంత్రులు గానీ, పార్టీలో జగన్ కు సన్నిహితంగా ఉన్న నేతలెవరూ జగన్ దరిదాపుల్లో కనిపించడం లేదుజగన్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేశారు విడదల రజనీ. జగన్ మొదటి విడత, రెండో విడతలోనూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి పనిచేశారు. తనకు ఏ బాధ్యత అప్పగించిన అంకిత భావంతో పనిచేయడం ఆమె నైజం. రాజకీయ అరంగేట్రం చంద్రబాబే చేయించారు. తెలుగుదేశంలో కీలకంగా వ్యవహరించారు. అయితే వైఎస్ జగన్ పార్టీ స్థాపించిన కొత్తల్లో ఆ పార్టీ పట్ల ఆకర్షితురాలై వైఎస్ఆర్ సీపీలో చేరారు. సొంతూరు యాదాద్రి భువనగిరి. అయినా ఆంధ్రా రాజకీయాలలో కీలక పాత్ర పోషించారుప్రస్తుతం అధికారం కోల్పోయి నైరాశ్యంతో ఉన్న విడదల రజనీ తన అడుగులు వ్యూహాత్మకంగా వేస్తున్నారు. జగన్ తన తీరు మార్చుకోవడం లేదు. ఇంకా నిరంకుశ ధోరణితోనే ఉన్నారు. మొన్నటిదాకా తన పార్టీలో రోజా, విడదల రజనీ కీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు. అయితే ఇటీవల కాలంలో వారిని జగన్ పక్కన పెట్టేసినట్లు కనిపిస్తోంది. కొత్తగా బుల్లితెర నటి శ్యామలను పార్టీలో కీలక పదవి అప్పగించారు. ప్రస్తుతానికి రోజా బయటపడకపోయినా రజనీ మాత్రం లోలోపల రగిలిపోతున్నారని రాజకీయ విమర్శకులు భావిస్తున్నారువిడదల రజనీ రాజకీయాలలో సరికొత్త స్కెచ్ వేయడానికి వడివడిగా ముందడుగు వేస్తున్నారు. త్వరలోనే వైఎస్ఆర్ సీపీ సభ్యత్వానికి రాజీనామా చేయడానికి సిద్ధమవుతున్నారని సమాచారం. చిలకలూరి పేట ఎమ్మెల్యేగా అక్కడ స్థానికంగా ప్రజలతో మమేకమవుతూ తన సేవా కార్యక్రమాలను నిరంతరం చేస్తూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేగా పేరు తెచ్చుకున్నారు. తెలుగుదేశంలో హేమాహేమీల వంటి పత్తిపాటి పుల్లారావు వంటి నేతనే ఓడించారు. ఎమ్మెల్యేగా గెలిచిన తొలి విడతలోనే మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పైగా కీలకమైన ఆరోగ్యశాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో జరిపిన సర్వేలో విడదల రజనీ చిలకలూరిపేట నుంచి ఓడిపోతారని సర్వే రావడంతో చివరి మూమెంట్ లో గుంటూరు వెస్ట్ నుంచి పోటీచేయించారు జగన్. అయితే 50 వేల ఓట్ల తేడాతో రజనీ ఓడిపోయారుఇటీవలే మాజీ మంత్రి వైసీపీకి చెందిన బాలినేని శ్రీనివాస్ రెడ్డి జనసేన పార్టీలో చేరారు. ప్రస్తుతం రజనీ బాలినేని తో పవన్ కళ్యాణ్ జనసేప పార్టీలో చేరేందుకు మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. గత కొద్ది రోజులుగా ఇదే టాపిక్ ఆంధ్రా పాలిటిక్స్ లో వైరల్ న్యూస్ గా మారింది. అయితే దీపిపై విడదల రజనీ ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు..సరికదా పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు కూడా ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. అవన్నీ ఊహాగానాలే అని వైసీపీ నేతలు కొట్టిపారేస్తున్నారు. అటు తెలుగుదేశం నుంచి ఇటు బీజేపీ నుంచి కూడా విడదల రజనీకి ఆఫర్లు వస్తునే ఉన్నాయి. అయితే వీటన్నింటికీ కాదని రజనీ జనసేనలోకి వెళ్లేందుకే మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. మరో వారం రోజుల్లో విడుదల రజనీ నిర్ణయం తీసుకోబోతోందని న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

# ఇమేజ్ డ్యామేజ్ చేస్తున్న షర్మిళ




**విజయవాడ, అక్టోబరు 29, పెన్ పవర్:** జగన్ ను ఎంత డ్యామేజ్ చేయాలో అంతా చేస్తోన్న షర్మిల..వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ ఆస్తుల రగడ కొనసాగుతూనే ఉంది. అదో సీరియల్ ఎపిసోడ్ ను తలపిస్తోంది. ఈరోజు మరో బాంబు వేశారు వైయస్ షర్మిల.
వైయస్ షర్మిల దూకుడు ప్రదర్శిస్తున్నారు. జగన్ తో పాటు వైసీపీ నేతలపై విరుచుకుపడుతున్నారు.వైయస్ కుటుంబ ఆస్తి వివాదం రగులుతున్న సంగతి తెలిసిందే. అయితే దీనిపై షర్మిల ఒంటరి పోరాటం చేస్తుండగా..వైసీపీ నుంచి మాత్రం నేతలు ఎదురు దాడి చేస్తున్నారు. అయినా సరే షర్మిల ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు.తనకు జగన్ అన్యాయం చేశారని..వైసిపి నేతలు ఎందుకు తెలుసుకోవడం లేదని..తనపై ఎందుకు పడ్డారని ఆమె ప్రశ్నిస్తున్నారు. తాజాగా మీడియా ముందుకు వచ్చిన ఆమె బాబాయి వైవి సుబ్బారెడ్డి పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ మోచేతి నీళ్లు తాగే వ్యక్తి వై వి సుబ్బారెడ్డి గా అభివర్ణించారు. బాబాయ్ మీ కళ్ళేదుటే మా పిల్లలు పెరిగారు. వారికి అన్యాయం చేయాలని ఎలా అనిపించింది అంటూ ప్రశ్నించారు. అన్ని విషయాలు తెలిసిన మీరు కూడా ఇలా మాట్లాడడం ఏంటని నిలదీశారు. షర్మిల ఆరోపణల నేపథ్యంలో వైవి సుబ్బారెడ్డి తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే. షర్మిలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఆమె ఈరోజు స్పందించారు. వై వి సుబ్బారెడ్డి తీరును ఎండగట్టారు. వైసిపి హయాంలో సుబ్బారెడ్డి తో పాటు ఆయన కుమారుడు ఆర్థికంగా లబ్ధి పొందాలని సంచలన ఆరోపణలు చేశారు. జగన్ పక్కన ఉంటారు కనుక లేఖలో మీ ప్రస్తావన తెచ్చానని వైవి సుబ్బారెడ్డి కి తేల్చి చెప్పారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి తన నలుగురు మనవల్లకు ఆస్తిలో సమాన హక్కు ఉండాలని భావించారని..ఈ విషయం వైవి సుబ్బారెడ్డి కి సైతం తెలుసని చెప్పుకొచ్చారు. నేను చెబుతున్నది ముమ్మాటికీ వాస్తవమని.. దానిపై ప్రమాణం చేసేందుకు సైతం తాను సిద్ధంగా ఉన్నానని చెప్పుకొచ్చారు. సుబ్బారెడ్డి చెబుతున్న మాటలు నిజమని ప్రమాణం చేయగలరా అని ప్రశ్నించారు. తాను ప్రమాణానికి సిద్ధంగా ఉన్నానని.. మీరు కూడా ప్రమాణానికి సిద్ధంగా ఉండాలని సవాల్ చేశారు. నాకు న్యాయబద్ధంగా రావాల్సిన ఆస్తిలో వాటా ఇవ్వకుండా ఏవో చెబితే ఎలా అని ప్రశ్నించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నప్పుడు కంపెనీలకు మీ పేర్లు పెట్టుకున్నారని.. తాను అభ్యంతరం వ్యక్తం చేయకపోవడం వల్లే నీ పేర్లు పెట్టుకున్న విషయాన్ని గుర్తు చేసుకోవాలని అన్నారు షర్మిల..మధ్య ఆస్తుల పంపకాల ఒప్పందం కూడా జరిగిందని గుర్తు చేశారు షర్మిల. దానికి అనుగుణంగా ఆస్తుల పంపకాలు చేయాల్సిందేనని తేల్చి చెప్పారు. సొంత తల్లి పై కేసులు పెట్టిన జగన్ ఒక నాయకుడేనా? ఆయన నిజంగా శాడిస్ట్ అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు షర్మిల. అయితే అన్ని తెలిసి వైవి సుబ్బారెడ్డి బాబాయ్ అలా మాట్లాడడం బాధగా ఉందని కన్నీటి పర్యంతం అయ్యారు. తన సోదరుడి కోసం తనతో పాటు తన తల్లి ఎంతగానో కష్టపడ్డారో వైవి సుబ్బారెడ్డి కి తెలియదా అని ప్రశ్నించారు. కుటుంబ ఆస్తి ఒప్పంద పత్రం తన వద్ద ఉన్నా.. ఏ మీడియా హౌస్ కు వెళ్లలేని విషయాన్ని ప్రస్తావించారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి కుటుంబ గౌరవం కోసమే తాను ఆ ఒప్పందాన్ని బయట పెట్టలేదని తేల్చి చెప్పారు.మరోవైపు అన్న కోసం తాను అన్నీ చేశానని.. తనకోసం ఒక్క పని అయినా చేశారా అంటూ తిరిగి ప్రశ్నించారు షర్మిల. రెండు ఎన్నికల్లో సైతం పాదయాత్ర చేసిన విషయాన్ని ప్రస్తావించారు. జగన్ బెయిల్ రద్దు కోసమే తాము కోర్టులో కేసులు వేసామని చెబుతున్నారని.. తాను క్షేమంగా ఉండేందుకు తల్లిని ఎవరైనా జైలులో పెడతారా అని ప్రశ్నించారు షర్మిల. తనకు లాభం జరుగుతుందంటే తల్లిని కోర్టుకు ఏడుస్తారా అని ప్రశ్నించారు. అప్పట్లో రాజశేఖర్ రెడ్డి పేరును ఎఫ్ఐఆర్లో చేర్పించారని.. ఇప్పుడు తల్లి నీకు క్షోభ పెడుతున్నారని.. జగన్ లాంటి వ్యక్తి నాయకుడో.. శాడిస్టో అన్న విషయాన్ని వైసిపి నేతలే తేల్చుకోవాలన్నారు. మొత్తానికైతే జగన్ ను షర్మిల వెంటాడుతున్నారు. వేటాడినంత పని చేస్తున్నారు.

# వైసీపీలో భగ్గుమంటున్న కక్షలు

**శ్రీకాకుళం, అక్టోబరు 29, పెన్ పవర్:**
పలాస నియోజకవర్గంలో రాజకీయ కక్షలు తారాస్థాయికి చేరాయి. కాశీబుగ్గ పోలీసు స్టేషను లో వైసిపి నేతలపై టీడీపీ వర్గీయులు విచక్షణారహితంగా దాడి చేశారు. వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు అనుచరుడు వైసిపి నేత అల్లు రమణపై టీడీపీ వర్గీయులు శనివారం హత్యాయత్నం చేశారు. టీడీపీ నేతల దాడి నుండి తప్పించుకున్న అల్లు రమణ పోలీసులకు ఫిర్యాదు చేయడానికి కాశీబుగ్గ స్టేషనుకు వెళ్ళారు. తనపై దాడికి ప్రయత్నించిన కత్తితో పాటు వెళ్లి ఫిర్యాదు చేయడానికి స్టేషను కు వచ్చిన వైసిపి నేతలు అల్లు రమణ, మొదలవలస మన్మధరావు లపై టీడీపీ నేతలు ఇష్టరీతిన దాడి చేయడం కలకలం రేపుతోంది. పలాస నియోజకవర్గం వైసీపీ శ్రేణులు దీన్ని తీవ్రంగా ఖండించాయి. పోలీస్ స్టేషన్ లో కూడా తమకు రక్షణ కల్పించలేరా అని పోలీసులను, ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.మన్మధ రావు చొక్కా చింపిన టీడీపీ కార్యకర్తలు విచక్షణారహితంగా కొట్టారు. అల్లు రమణ పై కూడా టీడీపీ వర్గీయులు పిడిగుద్దులతో రెచ్చిపోయి దాడి చేశారు. ఈ సంఘటన జరుగుతున్న సమయంలో టీడీపీ సీనియర్ నేత పీరుకట్ల విఠల్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్లు అక్కడే ఉన్నారు. వీరభద్ర పురానికి చెందిన టీడీపీ నేత కొర్ల విష్ణు చౌదరి ఈ దాడి చేసినట్లు వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పోలీసు స్టేషను లో దాడి జరిగినప్పుడు కేవలం ఒకే ఒక కానిస్టేబుల్ మాత్రమే అడ్డుకోవడానికి ప్రయత్నించారని... కాశీబుగ్గ పోలీస్ స్టేషనులో 15 మందికి పైన సిబ్బంది ఉన్నా మిగతా వారు అడ్డుకోవడానికి ప్రయత్నించలేదని తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.పలాస నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆందోళన చేపట్టారు. మైనర్ బాలికను దారి కాచి దాడి చేసిన వారిని కఠినంగా



శిక్షించాలని పోలీసులను అప్పలరాజు డిమాండ్ చేశారు. తప్పు చేసిన వారిని శిక్షించడానికి బదులుగా, బాధితులపైనే దాడులు జరగడం బాధాకరం అన్నారు. కాశిబుగ్గ పోలిస్ స్టేషన్ లో వైసీపీ నేతలపై దాడి చేసిన టీడీపీ శ్రేణులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని మాజీ మంత్రి అప్పలరాజు డిమాండ్ చేశారు.పలాసలో వైసీపీ శ్రేణులపై జరుగుతున్న దాడులపై పోలీసులకు ఫిర్యాదు చేయడానికి తన ఇంటి నుంచి బయలుదేరుతున్న మాజీ మంత్రి అప్పలరాజును పోలీసులు అడ్డుకున్నారు. ఇంట్లో నుండి బయటకు రాకుండా పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్ట్ చేశారు. తాను పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేయడానికి వస్తున్నా అని చెబుతున్నా పోలీసులు ఆయన మాట వినిపించుకోలేదు. మాజీ మంత్రి అప్పలరాజు ను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అప్పలరాజు ఇంటి నుంచి బయటకు వెళ్తే శాంతి భద్రతలకు భంగం వాటిల్లుతుందని, అందుకే ఆయనను నిలువరించినట్లు పోలీసులు చెబుతున్నారు. పలాస నియోజకవర్గంలో రాజకీయ దాడులు పెరిగిపోయాయని, పోలీసులు సైతం తమకు రక్షణ కల్పించడం లేదని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

# ఆయన మనకొద్దు... అధిష్టానానికి తమ్ముళ్ల వినతి

**ఏలూరు, అక్టోబరు 29, పెన్ పవర్:**ఏలూరు జిల్లాలో ఆయన పరిచయం అక్కర్లేని నేత. 2019 నుంచి 2024 వరకు ఓ వెలుగు వెలిగారు. కానీ 2024 ఎన్నికల్లో ఓడిపోయారు. ఆ వెంటనే వైసీపీకి రాంరాం చెప్పారు. ఇప్పుడు టీడీపీలో చేరడానికి ట్రై చేస్తున్నారు. అయితే టీడీపీ హౌస్ ఫుల్ బోర్డు పెట్టేసింది. ఆయన్ను చేర్చుకోవద్దని తెలుగు తమ్ముళ్లు కోరుతున్నారు.ఏలూరు జిల్లా రాజకీయాలు ఎప్పుడూ హాట్ హాట్గా ఉంటాయి. ఇక్కడ అంతా క్యాస్ట్ పాలిటిక్స్ నడుస్తాయి. అవే ఎన్నికలపై ప్రభావం చూపుతాయి. అందుకే ప్రధాన పార్టీలు చాలా జాగ్రత్తలు తీసుకొని అభ్యర్థులను రంగంలోకి దింపుతాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలు ఏలూరులో రసవత్తరంగా సాగాయి. ఎట్టకేలకు కూటమి అభ్యర్థి విజయం సాధించారు.ఇక్కడిదాకా బాగానే ఉన్నా.. ఇప్పుడు రాజకీయం వేగంగా మారుతోంది. 2024 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన ఆళ్ల నాని ఓడిపోయారు. ఓటమి తర్వాత నాని జిల్లా అధ్యక్ష పదవికి, పార్టీకి రాజీనామా చేశారు. దీంతో ఆయన జనసేనలో చేరతారనే ప్రచారం జరిగింది. కానీ.. అనూహ్యంగా ఆళ్ల నాని టీడీపీలో చేరడానికి ప్రయత్నిస్తున్నట్టు తాజాగా వార్తలు వస్తున్నాయి.ఇప్పటికే టీడీపీలోని కీలక నేతలతో సంప్రదింపులు జరిపినట్టు తెలుస్తోంది. ఏలూరులో తన ఉనికిని కాపాడుకోవాలంటే.. ప్రాధాన్యత ఉన్న పోస్టు కావాలని.. ఆ హామీ ఇస్తేనే పార్టీలో చేరతానని నాని చెప్పినట్టు తెలిసింది. కానీ.. పార్టీ నుంచి మాత్రం స్పష్టమైన హామీ నానికి లభించలేదు. పక్కా హామీ కోసం ఆళ్ల నాని వెయిట్ చేస్తున్నట్టు ఏలూరులో టాక్.అయితే అసలు సమస్య ఇక్కడే మొదలైంది. ఆళ్ల నాని టీడీపీలో కీలక నేతలను కలిశారని తెలియగానే.. ఏలూరు టౌన్లోని కొందరు టీడీపీ నాయకులు లోకేష్ దగ్గరకు వెళ్లినట్టు తెలిసింది. 2019 నుంచి 2024 వరకు ఆళ్ల నాని తమను ఇబ్బందులకు గురిచేశారని.. ఆయన్ను పార్టీలో చేర్చుకోవద్దని స్పష్టం చేసినట్టు సమాచారం. అటు లోకేష్ కూడా వారి వాదనతో అంగీకరించినట్టు తెలిసింది.కూటమి అధికారంలోకి వచ్చాక.. ఏలూరు జిల్లా వైసీపీ దాదాపు ఖాళీ అయ్యింది. కీలక నేతలు అందరూ అటు జనసేనలోనో.. ఇటు టీడీపీ లోనే జాయిన్ అయ్యారు. దీంతో హౌస్ ఫుల్ అయ్యింది. ఈ కారణంగానే నానిని చేర్చుకోవడానికి ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది. నానికి జిల్లా వ్యాప్తంగా మంచి ఫాలోయింగ్ ఉంది. అలాంటి లీడర్ ఏ పదవి లేకుండా టీడీపీలో జాయిన్ అయితే.. విలువ తగ్గిపోతుందని నాని ఫ్యాన్స్ అంటున్నారు.ప్రస్తుతం ఏలూరు ఎమ్మెల్యేగా ఉన్న బడేటి చంటి మాత్రం నాని రాకపై అభ్యంతరం వ్యక్తం చేయలేదని తెలుస్తోంది. కానీ.. ద్వితీయ శ్రేణి నాయకులు మాత్రం నాని చేరికను గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా, జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన నానికి ఇలాంటి పరిస్థితి రావడం ఏంటనే చర్చ ఏలూరులో జరుగుతోంది. అయితే.. ఆయన టీడీపలో కాకుండా జనసేనలో చేరితే బాగుంటుంది అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## సరస్వతి పవర్ అనుమతులపై ఆరా

**అమరావతి, అక్టోబరు 29, పెన్ పవర్:** ఇంటి గుట్టు లంకకు చేటని పెద్దలు చెబుతారు. కొన్ని విషయాల్లో గుట్టుగా ఉండాలన్నది దానర్థం. ప్రస్తుతం మాజీ సీఎం జగన్కి చెందిన సరస్వతీ పవర్ కంపెనీ విషయంలో ఏం జరిగింది.. జరగబోతోంది?గతంలో సరస్వతి పవర్ కంపెనీకి కేటాయింపులపై ప్రభుత్వం వివరాలు సేకరిస్తోందా? కేటాయింపులు రద్దు చేస్తుందా? లేక సీఐడీ విచారణకు ఆదేశిస్తుందా? జగన్-షర్మిల వివాదంలో కొత్త కొత్త విషయాలు బయటకు వస్తున్నాయా? అవుననే సమాధానం వస్తోంది.జగన్-షర్మిల వివాదం నేపథ్యంలో సరస్వతి పవర్ కంపెనీకి సంబంధించి పూర్తి వివరాలు సేకరిస్తోంది ప్రభుత్వం. వీటిని కేటాయించిన భూములు రద్దు చేయాలని రైతుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. రాజకీయ నేతలు సీఐడీ విచారణకు డిమాండ్ చేస్తున్నారు.ఎన్నో ఏళ్లగా పోరాటం చేస్తున్నారు గురజాల టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు. ఈ కంపెనీకి భూముల కేటాయింపు ఎక్కువ భాగం పల్నాడు ప్రాంతంలో ఉండడమే దీనికి కారణంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది.సరస్వతి పవర్ కంపెనీకి సంబంధించి 1500 ఎకరాల్లో ప్రభుత్వ భూములున్నట్లు తెలుస్తోంది. దీని వ్యవహారాలు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిధిలోకి రావడంతో అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.ఆ కంపెనీ భూముల్లో ప్రభుత్వం, కొండ ప్రాంతం, పోరంబోకు, చుక్కల భూములున్నట్లు అంతర్గత సమాచారం. మరో రెండురోజుల్లో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్కు నివేదిక అందజేయనున్నారు అధికారులు. అటవీ, పర్యావరణ అనుమతులపైనా దృష్టి పెట్టారు.సరస్వతీ పవన్ కంపెనీ భూములపై పోరాటం చేస్తున్నారు టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు. ఈ క్రమంలో గత టీడీపీ సర్కార్ గనుల కేటాయింపును రద్దు చేసింది. అయితే వైసీపీ అధికారంలోకి రాగానే గనుల కేటాయింపును పునరుద్ధరించుకుందని ఆరోపిస్తున్నారు నేతలు. దీనికితోడు శాశ్వతంగా నీటి కేటాయింపులు చేసుకున్నారని అంటున్నారు.సరస్వతీ పవర్ కంపెనీ భూములపై ప్రశ్నించినందుకు కొన్ని ప్రాంతాల్లో రైతులపై కేసులు నమోదయ్యాయి. ఏళ్లు గడుస్తున్నా సిమెంట్ కంపెనీ నిర్మాణం జరగలేదు. ఫలితంగా ఆ ప్రాంతమంతా చిట్టడవిని తలపిస్తోంది.ఆయా భూముల్లో పంటలు పండించుకునే అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు రైతులు. గతంలో ఎకరా 3 లక్షలకు ఇచ్చామని, పరిశ్రమ నిర్మాణం జరగకపోవడంతో బహిరంగ మార్కెట్ ప్రకారం ధర చెల్లించాలన్నది వారి మాట. అన్నట్లు ఆ కంపెనీ సంబంధించిన భూముల విలువ మార్కెట్లో దాదాపు 10 వేల కోట్లకు పైగానే ఉంటుందని ఓ అంచనా. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

## ప్రకాశం నుంచి మరో నేతకు గ్రీన్ సిగ్నల్

**ఒంగోలు, అక్టోబరు 29, పెన్ పవర్:** ఏపీలో రాజకీయాలు వేడెక్కాయి. ఒకవైపు వైఎస్సార్ కుటుంబ ఆస్తి వివాదం నడుస్తుండగా.. మరోవైపు వైసీపీ నేతలు పెద్ద ఎత్తున పార్టీని వీడుతున్నారు ఏపీలో వైసీపీ నేతలు ఒక్కొక్కరు పార్టీకి గుడ్ బై చెబుతున్నారు. ఇందులో జగన్ కు అత్యంత సన్నిహితులు ఉండడం విశేషం. ఎన్నికల్లో పార్టీ ఘోరంగా ఓడిపోవడంతో పార్టీలో ఉండలేక చాలామంది బయటకు వెళ్తున్నారు. కొందరు టిడిపిలో చేరడానికి ప్రయత్నిస్తుండగా.. మరికొందరు జనసేన బాట పడుతున్నారు. అయితే పదవులు ఉన్నవారు సైతం వదులుకొని మరి క్యూ కడుతుండడం విశేషం. రాజ్యసభ సభ్యులు ముగ్గురితో పాటు మరో నలుగురు ఎమ్మెల్సీలు కూడా పార్టీకి గుడ్ బై చెప్పారు. పదవులు వదులుకున్నారు. మూడు రోజుల కిందట మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ గుడ్ బై చెప్పారు పార్టీకి. ఆమె బాటలోనే పలువురు మహిళా నేతలు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పుడు తాజాగా జగన్ కు సన్నిహిత నేత ఒకరు పార్టీని వీడేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆయనకు టిడిపి నుంచి పెద్ద హామీ ఉన్నట్లు సమాచారం. ప్రకాశం జిల్లాలో జగన్ కు అత్యంత సన్నిహితుడు, సమీప బంధువు బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఇప్పటికే పార్టీని వీడారు. జనసేనలో చేరిపోయారు. త్వరలో ఆయనకు జనసేనలో కీలక బాధ్యతలు ఇస్తారని ప్రచారం సాగుతోంది. కాగా వైసీపీ జిల్లా కొత్త అధ్యక్షుడిగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని నియమించారు జగన్. ఇంకోవైపు అదే జిల్లాకు చెందిన వైసీపీ సీనియర్ నేత, మాజీమంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి పార్టీ వీడుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఆయన నెల్లూరు ఎంపీ వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డికి సన్నిహితుడు. ప్రభాకర్ రెడ్డి పార్టీ మారుతున్నప్పుడే మహీధర్ రెడ్డి సైతం అనుసరిస్తారని టాక్ నడిచింది.కానీ మహీధర్ రెడ్డి మాత్రం వైసీపీలోనే కొనసాగేందుకు అప్పట్లో నిర్ణయం తీసుకున్నారు. ఇప్పుడు తాజాగా అదే వేంరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలుగజేసుకోవడంతో టిడిపిలోకి వచ్చేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.కందుకూరు నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు ప్రాతినిధ్యం వహించారు మహీధర్ రెడ్డి. కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వంలో ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా కూడా పనిచేశారు. ఆయన కుటుంబానికి సుదీర్ఘ రాజకీయ నేపథ్యం ఉంది. అయితే ఈ ఎన్నికల్లో మహీధర్ రెడ్డిని తప్పించి.. బుర్ర మధుసూదన్ యాదవ్ కు టికెట్ ఇచ్చారు జగన్. ఆ నిర్ణయాన్ని వ్యతిరేకించారు మహీధర్ రెడ్డి. ఎన్నికల సమయంలో అసంతృప్తితో రగిలిపోయారు. కానీ ఈ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు గెలిచారు. ఎన్నికల ఫలితాల అనంతరం మహీధర్ రెడ్డి సైలెంట్ గా ఉన్నారు. ఇప్పుడు ఏకంగా పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నారు.దసరా వేడుకలకు సంబంధించిన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో జగన్ ఫోటో లేదు. మహీధర్ రెడ్డి కార్యాలయంలో సైతం జగన్ ఫోటోలను తొలగించారు. దీంతో ఆయన పార్టీ మారడం ఖాయమని తేలిపోయింది. ఎప్పటికీ టిడిపి ముఖ్యులు చంద్రబాబు నుంచి మహీధర్ రెడ్డికి ప్రాధాన్యత విషయంలో కీలక హామీ తీసుకున్నట్లు సమాచారం. అయితే పార్టీని వీడుతారని సమాచారం తెలుసుకున్న వైసీపీ నేతలు మహీధర్ రెడ్డిని బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నారు. మరి మహీధర్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. దీనిపై ఒకటి రెండు రోజుల్లో క్లారిటీ రానుంది.

## రైల్వే స్టేషన్లు కిటకిట



**సికింద్రాబాద్: పెన్ పవర్:**దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణికులతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కిటకిటలాడుతోంది. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పండుగల సందర్భంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది.

## 30న గాంధీ భవన్ లో కులగణన పై సమావేశం

**పెన్ పవర్:**రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 4వ తేదీ నుంచి రాష్ట్రంలో కుల ఘనన ప్రక్రియ చేపట్టాలని అందు కోసం 80 వేల మంది ఉద్యోగులను కేటాయించి తగిన విధంగా ముందుకు పోతున్న విషయం తెలిసిందే. ఈ విషయంలో లోతుగా చర్చించి పార్టీ పరంగా దీనిపై ఒక కార్యాచరణ తీస్కోవాలని నిర్ణయించడం జరిగింది. అందువల్ల పార్టీ ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఈ నెల 30న బుధవారం నాడు ఉదయం 10.30 గంటలకు మంత్రులు, సలహాదారులు, ఎంపీ లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు, విప్ లు, కార్పొరేషన్ చైర్మన్ లతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,ఏఐసీసీ ఇంచార్జ్ ప్రధాన కార్యదర్శి దీపాదాస్ మున్షి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొంటారు.

# రంజీలో ఆడుతున్న 22 ఏళ్ల యువ బౌలర్‌కు బీసీసీఐ పిలుపు.. కివీస్‌తో మూడో టెస్టులో చోటు!

- సీమర్ హర్షిత్ రాణాకు ముంబై టెస్టులో చోటు దక్కడం దాదాపు ఖాయం!
- రంజీ ట్రోఫీలో బౌలింగ్, బ్యాటింగ్‌లో అద్భుత ప్రదర్శన
- ఇప్పటికే ట్రావెలింగ్ రిజర్వ్‌గా ప్రకటించిన బీసీసీఐ సెలక్టర్లు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్–న్యూజిలాండ్ జట్ల మధ్య చివరిదైన మూడవ టెస్ట్ మ్యాచ్ ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరగనుంది. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ సీమర్ హర్షిత్ రాణా అరంగేట్రం చేసే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది. హర్షిత్ రాణా రంజీ ట్రోఫీలో బంతితో పాటు బ్యాటింగ్‌లోనూ రాణించడంతో సెలక్టర్ల దృష్టిలో పడినట్టు బీసీసీఐ వర్గాలు చెబుతున్నాయి. కాగా దేశవాళీ క్రికెట్‌లో అద్భుతంగా రాణిస్తున్న 22 ఏళ్ల ఈ యువ ఫాస్ట్ బౌలర్‌ను మూడవ టెస్టుకు ట్రావెలింగ్ రిజర్వ్‌గా బీసీసీఐ ఇటీవలే ప్రకటించింది. ఈ మేరకు 18 మందితో కూడిన ఆటగాళ్ల జాబితాలో హర్షిత్ రాణా పేరుని చేర్చింది. దీంతో శుక్రవారం మొదలు కానున్న ఈ మ్యాచ్‌లో అతడు అరంగేట్రం చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని విశ్లేషణలు వినిపిస్తున్నాయి.(మంగళవారం) సాయంత్రమే అతడు ముంబై బయలుదేరి వెళ్లి టీమిండియాతో కలవనున్నాడు. హర్షిత్ రాణా రంజీ ట్రోఫీలో ఢిల్లీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. రంజీ ట్రోఫీ మూడవ రౌండ్ మ్యాచ్‌లో అస్సాంపై అద్భుతమైన ప్రదర్శన చేశాడు. అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 5 వికెట్లు తీయడంతో పాటు అర్ధ సెంచరీ (59) కూడా సాధించాడు. దీంతో అస్సాంపై ఢిల్లీ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది. హర్షిత్ రాణా ప్రదర్శనను గుర్తించిన సెలక్టర్లు నేరుగా ముంబై వచ్చేయాలని పిలిచారు. టీమిండియా నుంచి పిలుపు రావడంతో నాలుగవ రౌండ్ రంజీ మ్యాచ్‌లకు హర్షిత్ రాణా దూరం కానున్నాడు.

కాగా ఇటీవల బంగ్లాదేశ్‌తో టీ20 సిరీస్ ఆడిన జట్టులో కూడా హర్షిత్ రాణాకు చోటు దక్కింది. అయితే తుది జట్టులో చోటు దక్కలేదు.

న్యూజిలాండ్‌తో మూడు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను న్యూజిలాండ్ ఇప్పటికే 2–0 తేడాతో గెలుచుకుంది. చివరి మ్యాచ్‌లోనైనా ఓదార్పు విజయం సాధించాలని టీమిండియా భావిస్తోంది. ఆస్ట్రేలియాతో 5 టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌కు ముందు విజయంతో ఆత్మవిశ్వాసాన్ని కూడగట్టుకోవాలని చూస్తోంది.

# సంజు శాంసన్‌కు నేను పెద్ద అభిమానిని: భారత మాజీ స్టార్ క్రికెటర్



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత క్రికెటర్ సంజూ శాంసన్ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నాడనే విమర్శకు చెక్ పెట్టిన విషయం తెలిసిందే. ఇటీవల ఉప్పల్ వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన ఆఖరి టీ20లో ఈ భారత వికెట్ కీపర్ చెలరేగిపోయాడు. కేవలం 40 బంతుల్లోనే శతకం బాది టీ20ల్లో భారత్ తరఫున ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన రెండో బ్యాటర్‌గా నిలిచాడు. ఈ ఒక్క ప్రదర్శనతో భారత జట్టులో తన స్థానానికి డోకా లేదని నిరూపించాడు.ఎంతో ప్రతిభ దాగి ఉన్న సంజు శాంసన్ పై భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా ప్రశంసలు కురిపించాడు. టీమిండియా తరఫున వైట్ బాల్ ఫార్మాట్ లో రైనా అత్యుత్తమ ఆటగాడిగా పేరు తెచ్చుకున్న రైనా.. సంజు శాంసన్ గురించి తన అభిప్రాయాన్ని చెప్పుకొచ్చాడు. “నేను సంజూ శాంసన్‌కి పెద్ద అభిమానిని. అతను చాలా ప్రతిభావంతుడు. అతని నుండి ఇంకా చాలా అద్భుతమైన ఇన్నింగ్స్‌లు వస్తాయి. అతనిలో కెప్టెన్సీ నైపుణ్యాలు కూడా ఉన్నాయి”. అని రైనా చెప్పాడు. టీ20 క్రికెట్ లో భారత జట్టు తరపున సెంచరీ చేసిన తొలి ప్లేయర్ గా రైనా నిలిచాడు. మిస్టర్ ఐపీఎల్ గా అతనికి పేరుంది. చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడి చిన్న తలాగా పేరు తెచ్చుకున్నాడు. సంజు శాంసన్ విషయానికి వస్తే అతను 2025 ఐపీఎల్ లో రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ గా కొనసాగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. తొలి రిటైన్ ప్లేయర్ గా శాంసన్ ను తీసుకోవడం దాదాపుగా ఖాయమైంది. అతనితో పాటు జైశ్వాల్ ను రెండో రిటైన్ ప్లేయర్ గా తీసుకోనున్నట్టు సమాచారం. ఐపీఎల్ 2024 లో రాజస్థాన్ రాయల్స్ జట్టును అద్భుతంగా నడిపించిన శాంసన్ ను మరోసారి నమ్ముకుంది.

# ఆఖరి టెస్టుకు పంత్ దూరం?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇప్పటికే రెండు టెస్టుల్లో ఓడి సిరీస్ చేజార్చుకున్న టీమిండియాకు మరో ఎదురు దెబ్బ తగులుతోంది. మోకాలి గాయంతో ఇబ్బందిపడుతోన్న వికెట్‌కీపర్/ బ్యాటర్ రిషబ్ పంత్ ఆఖరి టెస్టుకు దూరం కానున్నాడని నివేదికలు వెల్లడిస్తున్నాయి. అతని స్థానంలో యువ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ కీపింగ్ బాధ్యతలు చేపట్టవచ్చని జాతీయ మీడియా పేర్కొంది.

బెంగళూరు టెస్టులో గాయపడిన పంత్ మూడో రోజు మైదానంలోకి రాలేదు. మోకాలి గాయం కారణంగా అసౌకర్యంగా కనిపించాడు. దాంతో, అతని స్థానంలో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ కీపింగ్ చేపట్టాడు. మరుసటి రోజే అతను ఆ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నప్పటికీ, అతనికి విశ్రాంతినిచ్చే యోచన టీమ్ మేనేజ్మెంట్ చేస్తోందట. రాబోవు ఆస్ట్రేలియా పర్యటనను దృష్టిలో ఉంచుకొని అతనికి రెస్ట్ ఇవ్వాలని నిర్ణయించిందని సమాచారం.

ఒకవేళ పంత్ దూరమైతే, భారత తది జట్టులో.. బ్యాటింగ్ ఆర్డర్‌లో పలు మార్పులు జరగవచ్చు. రోహిత్, జైస్వాల్, గిల్ తొలి మూడు స్థానాలకు పరిమితం కాగా.. నాలుగో స్తానంలో సర్ఫరాజ్ ఖాన్ బ్యాటింగ్ చేయనున్నాడని కథనాలు వస్తున్నాయి. అదే జరిగితే, భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐదో స్థానానికి పరిమితం కానున్నాడు.

**బుమ్రాకు రెస్ట్...!**

పంత్‌తోపాటు ప్రధాన పేసర్ బుమ్రాకు విశ్రాంతినివ్వడంపై మేనేజ్మెంట్ చర్చిస్తోందట. ఎలాగూ, సిరీస్ చేజారింది కనుక బెంచ్‌ను పరీక్షించనుందని సమాచారం. ఇక వాంఖడే పిచ్ స్పిన్‌కు అనుకూలం కావడంతో స్పిన్ త్రయం సుందర్, అశ్విన్, జడేజాలు జట్టులో కొనసాగనున్నారు.



రోష్ని వాలియా యొక్క దుస్తులు ప్రతి ఫ్యాషన్‌స్టార్‌కు అవసరం

# ప్రియాంక అరుళ్ మోహన్.. బ్లాక్ డ్రెస్సులో స్టన్నింగ్ గ్లామర్ షో



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రియాంక అరుళ్ మోహన్ తాజాగా తన సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇందులో ఆమె బ్లాక్ అవుట్‌ఫిట్‌లో గ్లామర్ కాంబినేషన్‌తో కనిపిస్తోంది. అమీత్ అగర్వాల్ డిజైన్ చేసిన ఈ ప్రత్యేక డ్రెస్ ఆమె అందంలో బాగా కలిసిపోయింది. స్టైలింగ్ లో ఆమె స్టిల్ కూడా ఈ అవుట్‌ఫిట్‌కు పూర్తిగా న్యాయం చేసింది. ఫోటోగ్రాఫర్ పళణియప్పన్ సుబ్రహ్మణ్యం కెమెరాతో తీసిన ఈ ఫొటోస్ బ్యాక్ కలర్ బ్యాక్‌గ్రౌండ్‌తో ప్రియాంక అందాన్ని హైలైట్ చేస్తున్నాయి. ప్రియాంక మోహన్ తన హుందాతనంతో హృదయాలను గెలుచుకుంటూ పోతున్నారు. ఆమె తన ప్రత్యేకమైన శైలి, అందంతో ప్రతి ఫోటోలోనూ ఒక కొత్తగా కనబడుతున్నారు. ఈ లుక్‌లో ప్రియాంక లుక్స్ తో పాటు ఒక ప్రత్యేకమైన గ్లామర్‌ను ప్రదర్శిస్తోంది. ఫ్యాషన్‌కు సంబంధించిన జ్యువెలరీ, ఆరుస్ జ్యూవెల్స్ ఆమెకు మరింత అందాన్ని తెచ్చిపెట్టాయి. ఇందులో స్టైలిష్ కాన్సెప్ట్ తో ఆమె తనకున్న అందాన్ని మళ్లీ రీడిఫైన్ చేసుకున్నారు.దకెరీర్ విషయానికి వస్తే, ప్రియాంక మోహన్ ప్రస్తుతం టాలీవుడ్, కోలీవుడ్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ ముందుకు సాగుతున్నారు. ‘సరిపోదా శనివారం’ వంటి హిట్ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆమె, ఇప్పుడు పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న ‘ఓజీ’ లో కూడా కనిపించబోతున్నారు. ఇక విశ్వక్ సేన్ సరసన నటించబోయే మరో సినిమాతో ఆమె జోరు కొనసాగిస్తోంది.

ఇలా ప్రతి సినిమాలో తనదైన ముద్ర వేసుకుంటూ వెళ్తున్న ప్రియాంక, ప్రస్తుతం సౌత్ ఇండస్ట్రీలో తన ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఆమె తన ప్రతి ప్రాజెక్ట్‌లోనూ ఒక కొత్త ఛాలెంజ్ లాంటి క్యారెక్టర్ తో కనిపిస్తోంది, నటనలో మరింత కొత్తగా నిరూపించుకుంటూ వస్తున్నారు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ సినిమాలో ఆమె పాత్ర ప్రత్యేకంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఆ సినిమాపై అంచనాలు మామూలుగా లేవు. తప్పకుండా అమ్మడి రేంజ్ ను పెంచే సినిమాగా ద నిలుస్తుందని చెప్పవచ్చు.



ఈ కృతి శెట్టి చిత్రాలన్నీ ఆధునిక శైలికి సంబంధించినవి

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com